క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమ పూజలు



నందిగామ: మండలంలోని అంబారుపేట గ్రామంలో శ్రీ సత్యమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజైన మంగళవారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. వేకువజామునే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సామూహిక కుంకుమ పూజలలో పలు గ్రామాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా పలు రకాల హోమాది కార్యక్రమాలు జరిగాయి. ఆయా పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

50 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



పెనుగంచిప్రోలు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ ఈనెల మొదటి రోజు మంగళవారం సాయంత్రానికి 50 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్ అన్నారు. వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రజాప్రతినిధులతో కలిసి లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం



మక్కపేట(వత్సవాయి): గ్రామంలో వేంచేసియున్న శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల నడుమ దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాలను ప్రత్యేక అభిషేకాలు జరిపించారు. అనంతరం శివకల్యాణం చేశారు. ఆలయ నిర్మాణ ధర్మకర్త మల్లెల గాంధీ దంపతులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు, కార్యక్రమంలో అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ, కృష్ణశంకర్, రాఘవ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను మంగళవారం అందించారు. మండలంలోని కొణకంచి గ్రామానికి చెందిన కె వెంకటేశ్వర్లసైదులుకు రూ.60 వేలు, శివాపురం గ్రామానికి చెందిన ధారావతు సీత రూ.60 వేలు, సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన శీలం మల్లేశ్వరి రూ.1.20 లక్షలు, యడ్లపల్లి విశ్వనాథం రూ.60 వేలు, పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన నల్లబోతు పిచ్చయ్యకు రూ.1.20 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, సర్పంచ్‌లు వేల్పుల పద్మకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాపల

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ ముదిరాజ్ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పేట పట్టణానికి చెందిన చాపల వెంకటేశ్వర్లు ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ముదిరాజ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని ముదిరాజ్ నుంచి నియామకపత్రం అందుకున్నట్లు చాపల వెంకటేశ్వర్లు ముదిరాజ్ మంగళవారం తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన ముదిరాజ్ సంఘ స్థానిక, జిల్లా, రాష్ట్ర నాయకులకు ఈ సందర్భంగా చాపల వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి బీరువా బహూకరణ

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి బ్రహ్మంగారి ఆలయానికి గ్రామానికి చెందిన బెల్లంకొండ ఏడు కొండలు మంగళవారం బీరువాతో పాటు నూతన వస్త్రాలు స్వామివారికి బహూకరించా రని ఆలయ అర్చకులు నాంపల్లి వెంకట సుబ్బా చారి తెలిపారు. ముందుగా స్వామి వారి ఆశీస్సులు పొందిన తర్వాత బీరువాను అందజేశారు.

మహిళలకు అగ్రాసనం

ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను



ద్వాక్రా సభ్యులతో కలిసి సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను దంపతులు

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ఎక్కువ పథకాలను మహిళలకు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో మంగళవారం మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత తమ ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. పసుపు-కుంకుమ పేరుతో డ్వాక్రా మహిళలను నిలువునా ముంచిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఉందన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో 1184 డ్వాక్రా గ్రూపులకు రూ.10,60,54,432 లను మూడో విడతలో ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, విమలాభాను ఫౌండేషన్ చైర్‌పర్సన్ సామినేని విమలాభాను, మైనింగ్, పూసల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు బత్తుల రామారావు, చేని కుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వేల్పుల రవికుమార్, సొసైటీ అధ్యక్షులు గింజుపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అక్క చెల్లెమ్మలకు ఆర్థిక దన్ను

వత్సవాయి: అక్కా చెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా ఆర్థిక దన్నుగా ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూలేని విధంగా పొదుపు సంఘాల ఖాతాల్లో నేరుగా జమచేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. మండలంలో 1695 గ్రూపులకుగాను కోటి 12 కోట్ల 78 లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు ఉదయభాను చెక్కులను అందించారు. ఏఎంసీ చైర్మన్ ముత్తనేని విజయశేఖర్, పీడీ శ్రీనివాస్, ఎంపీపీ చెంబేటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, వైఎస్ ఎంపీపీలు కాటేపల్లి రవిరామతులసి, కొలికపోగు వెంకటేశ్వర్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు గంగిపోగు శిరీష పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

అభివృద్ధి పనుల్లో అవకతవకలు.. అధికారుల విచారణ



విచారణ చేస్తున్న ఎస్ఎస్ఏ అధికారులు

పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ చైర్మన్ బత్తుల వెంకటనర్సు పాఠశాలలో జరుగుతున్న పనుల్లో అవకతవకలు జరిగాయని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి. ఉమామహేశ్వరావు ఆధ్వర్యంలో బృందం విచారణ నిర్వహించింది. నాడు-నేడు, నాబార్డు నిధులతో పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. అనంతరం హెచ్ఎం కె. జలజ, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులతో చర్చించారు. నాడు-నేడు కింద వచ్చిన సిమెంట్, ఇటుకలను నాబార్డు వారు నిర్వహిస్తున్న పనులకు వినియోగిస్తున్నారని పేరెంట్స్ కమిటీ చైర్మన్ చెబుతున్నారని, కమిటీ సభ్యులకు, ఉపాధ్యాయులకు మధ్య సమన్వయ లోపం ఉన్నట్లు గుర్తించామని ఉమామహేశ్వరరావు అన్నారు. దీనిపై విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఎస్ఎస్ఏ సీఎంఓ టి. రాంబాబు, ఏఎంఓ , ఏఈ ప్రసాద్, పేరెంట్స్ కమిటీ వైస్‌చైర్మన్ మెండెం ద్రాక్షావలి, సీఆర్‌పీ గోపాలరావు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో డ్వాక్రా బజార్ ఏర్పాటు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో డ్వాక్రా బజార్ త్వరలో ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మంగళవారం ఆయన గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ పెనుగంచిప్రోలులో డ్వాక్రా బజార్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి రూ.10 లక్షలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే చిల్లకల్లులో కూడా డ్వాక్రా బజార్ ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో డ్వాక్రా మహిళలు వారు తయారు చేసే వస్తువులు, ఉత్పత్తులు స్థానికంగా విక్రయించుకొని లబ్ధి పొందవచ్చన్నారు.

వేలంపాట వాయిదా

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ఉక్కు కళావేదికలో నిర్వహించే కార్యక్రమాలకు అద్దె వసూలు చేసుకొను హక్కు కోసం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన బహిరంగ వేలంపాట అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ చదవోలు నాగ మల్లేశ్వరరావు తెలిపారు. మరలా ఈ బహిరంగ వేలంపాట తేదీ, సమయం త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

జగ్గయ్యపేట:తిరుమలగిరిలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఏసీ దాసరి శ్రీరామవర ప్రసాద రావు మంగళవారం తెలిపారు. ఐదో తేదీన అంకారోహణ, స్వామి వారిని పెళ్లి కుమారుని చేయటం, మండల దీక్ష స్వాముల ఇరుముడి విరమణ, 6తేదీ రాత్రి తొమ్మిది గంటలకు స్వామివారి కల్యాణం, ఏడున రథోత్సవం, ఎనిమిదిన కలశ స్నాప న, తొమ్మిదిన వసంతోత్సవం, పూర్ణాహుతి, 10న పవళింపు సేవ, అశ్వవాహన సేవ నిర్వహిస్తామన్నారు.

వేతనాలు పెంచాలని నిరసన

వీరులపాడు(కంచికచర్ల): సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని స్థానిక మండల వనరుల కేంద్ర కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. కాంట్రాక్టు బేసిక్‌పై పనిచేసే సిబ్బందిని ఉద్యోగంలో పర్మినెంట్ చేయాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కచ్చితమైన కొలతలతో సరిహద్దుల గుర్తింపు

కంచికచర్ల : వందేళ్ల క్రితం నాటి భూముల్లో జగనన్న భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం రీ సర్వే చేపట్టి అనతికాలంలో కచ్చితమైన కొలతలు, హద్దులతో సర్వే హద్దు రాళ్లను పాతుతున్నామని తహసీల్దార్ వడ్డేశ్వరపు రాజకుమారి అన్నారు. పరిటాలలో మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు భూములను రీ సర్వే చేసి ఆ భూముల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన సరిహద్దు రాళ్లను పాతారు. తహసీల్దార్ మాట్లా డుతూ, రైతులు పొలానికి భూ హక్కు పత్రంతో హాజరుకావాలని కోరారు. స్టోన్ ప్లాంటేషన్ ఈ ఏప్రిల్ 15 తేదీలోగా సరిహద్దురాళ్లను పాతేలా తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు, కౌలు రైతులు తమ సిబ్బందికి సహకరించాలన్నారు. డీటీ నాగులమీరా, ఆర్ఐ శిరీష పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ వరలక్ష్మి

నందిగామ: పట్టణ పరిధిలో పలు రహదారుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, వాటికి ప్రజలు సహకరించాలని చైర్ పర్సన్ మండవ వరలక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 11:30కు ప్రారంభమైంది. ఈ సమావేశంలో 23 అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. పలు అంశాలపై అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. కమిషనర్ డాక్టర్ జయరాం కౌన్సిలర్లు అడిగిన ప్రతి ప్రశ్నకు కూడా లెక్కలతో కూడిన సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలన్నారు. ముఖ్యంగా పలు ప్రధాన రహదారుల విస్తరణ పనులు జరుగుతున్నాయని వాటిని త్వరలోనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. వేసవికాలం నేపథ్యంలో పట్టణ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్‌లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మి, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ షేక్ ఎన్. మీరా

నందిగామ: పశువుల ఆరోగ్యంపై పశుపోషకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి అటారి జోన్ 10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్. మీరా అన్నారు. గరికపాడులోని డాక్టర్ కేఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పల్లగిరి గ్రామంలో మంగళవారం ఉచిత మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయంతో పాటు రైతులు పశువులను పోషించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ తరుణంలో పశువుల ఆరోగ్యంపై కూడా వాటి పోషకులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అవి ఆరోగ్యంగా ఉంటేనే మనకు నాణ్యమైన పాలను అందించగలుగుతాయన్నారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి విజయాభినందన, ఉప విస్తరణ సంచాలకుడు డాక్టర్ ముకుంద రావు, డాక్టర్ భాస్కరరావు, శివప్రసాద్, పల్లగిరి గ్రామ సర్పంచ్ రవిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాము పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి



కాలనీలో ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

మక్కపేట(వత్సవాయి): జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని ఎంపీడీవో ఎస్వీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం హౌసింగ్, పంచాయతీరాజ్ సిబ్బందితో కలిసి గ్రామంలో నిర్మాణంలో కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే ఇనుము, సిమెంట్‌ను ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇవ్వాలని తెలిపారు. లబ్ధిదారులు కూడా నిర్మాణాలను నిలిపి వేయకుండా పూర్తి చేసుకోవాలన్నారు. కాలనీలో విద్యుత్ స్తంభాలు వేసి, వెంటనే కనెక్షన్లు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సుందరరామయ్య, హౌసింగ్ ఏఈ చిందబరేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కొమరగిరి సంక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

జైన ధర్మంతో సమాజంలో శాంతి స్థాపన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైన ధర్మం సమాజంలో శాంతిస్థాపనకు అండగా ఉంటుందని పలువురు జైన మతగురువులు అన్నారు. మహావీర్ జయంతిని పురస్కరించుకొని జైన్ సమాజ్ ఆధ్వర్యాన మంగళవారం వన్‌టౌన్‌లో శోభయాత్ర జరిగింది. మహావీర్ జయంతి పురస్కరించుకొని పాతబీస్తీలో భారీ ర్యాలీ చేశారు. జైనులు నృత్యాలు చేస్తూ మహావీర్‌ను స్మరించుకుంటూ ముందుకు సాగారు. మహిళలు, పురుషులు జైన సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొన్నారు. జైనులు అహింస, సర్వప్రాణి రక్షణ, సత్యం వంటి అంశాలపై నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. మహావీరుని విగ్రహాన్ని వెండి రథంలో ఉంచి శోభయాత్రలో ఊరేగించారు. జైనులు వారి ముందుకు వచ్చిన మహావీరుని విగ్రహాలకు వారివారి సంప్రదాయరీతిలో నేలపై పీటలు ఉంచి బియ్యం చల్లి స్వాగతం పలికారు. పాతబస్తీ ఆలయాల నుంచి ప్రారంభమైన శోభయాత్ర వన్‌టౌన్‌లోని కేటీరోడ్డు, రమణయ్య కూల్‌డ్రింక్‌షాప్ సెంటర్, హిందూహైస్కూల్, సుబ్బరామయ్యవీధి, రాజారంగయ్యప్పారావు వీధి తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ప్రాంగణానికి చేరుకుంది.

జైన ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జైన దేవాలయాల్లో ఉదయం భక్తామార్ పూజ, అనంతరం శాంతి పూజ తదితర కార్యక్రమాలను సంప్రదాయ రీతిలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూలబావి వీధిలోని ఆలయం, మార్వాడీ గుడి వీధిలోని ఆలయాలు భక్తులతో కళకళలాడుతూ కనిపించాయి.

మిర్చి పంటకు నిప్పు పెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు



మంటల్లో కాలిపోతున్న మిర్చి

కంభంపాడు(వత్సవాయి): గుర్తుతెలియని వ్యక్తులు 50 క్వింటాళ్ల మిర్చికి నిప్పు పెట్టిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు గ్రామానికి చెందిన ఉయ్యూరు రామారావుకు చెందిన మిర్చిని కల్లంలో ఆరబోసి కుప్పగా పోశాడు. మంగళవారం నాడు బస్తాలలో మిర్చిని నింపేందుకు సిద్ధం చేసుకున్నారు. తెల్లవారుజాము సమయంలో మిర్చి కుప్ప నుంచి మంటలు చెలరేగడంతో చుట్టుపక్కలవారు తేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేయగా అప్పటికే పరిస్థితి చేయి దాటిపోయి మంటలు దట్టంగా వ్యాపించడంతో మిర్చి మొత్తం మంటల్లో కాలిపోయింది. రైతు రామారావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ అభిమన్యు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించాన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పదిలక్షల వరకు నష్టం జరిగిందని రైతు వాపోయారు.

ఆసరాతో జీవనోపాధి పొందాలి

నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: మహిళల జీవనోపాధి ద్వారా ఆదాయ అవకాశాలను పెంపొందించుకునేందుకు వైఎస్సార్ ఆసరా పథకం ఎంతో దోహద పడుతుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు.

5,926 మందికి రూ. 4.95 కోట్ల లబ్ధి..

పట్టణంలోని 5,926 మంది డ్వాక్రా మహిళల ఖాతాలలో ఆసరా పథకం ద్వారా రూ. 4.95 కోట్లను జమ చేసినట్లు జగన్‌మోహనరావు తెలిపారు. మహిళలు ఈ నగదును ఉపాధి అవకాశాలకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు మాడుగుల నాగరత్నం, ఓర్సు లక్ష్మీ, కమిషనర్ జయరాం, నాయకులు పాకాలపాటి కిరణ్, బండారు వెంకట్రావ్, కరి రవీంద్ర, వీసం దుర్గారావు, యాకుబ్ వలీ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



పరిటాలలో మహిళ తెలియజేస్తున్న సమస్యను వింటున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

నందిగామ టౌన్: పేద, బడుగు, బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ చంద్రబాబు ఐదేళ్ల పాలన అవినీతిమయమన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి తావులేకుండా పారదర్శక పాలన సాగిస్తున్నారని తెలిపారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో తమ పార్టీ పుట్టిందని చెప్పుకునే చంద్రబాబు సెంటు భూమి కూడా పేదలకు అందించలేదని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు అందించి నిరుపేదల సొంతింటి కలను సాకారం చేశారని గుర్తు చేశారు. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నల్లాని అయ్యన్న, నాయకులు బండారుపల్లి కపిల్, నల్లాని సాయి, పలువురు నాయకులు, కార్యకర్తలు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం..

కంచికచర్ల: ఇల్లు, ఇళ్లస్థలం లేని అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తుందని నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు అన్నారు. పరిటాల గ్రామంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరించంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ చరిత్రలోనే ప్రజలకిచ్చిన హామీలు పూర్తిగా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని పరిష్కరించాలని మహిళలు కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే త్వరలోనే జలజీవన్ మిషన్ ద్వారా గ్రామంలోని ప్రజలందరికీ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, గ్రామ గృహసారథుల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్, నాయకులు మార్త శ్రీనివాసరావు, యద్దనపూడి విజయారావు, కర్ల రామకృష్ణ, వేముల నాగరాజు, వేముల జీవరాజు, జమలయ్య, జాన్‌బాబు, ఏసుబాబు, జిక్కుల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పుష్కలంగా సాగు నీటిని అందించడమే లక్ష్యం

'జలకళ' పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావు..



జలకళ పథకం ద్వారా వేస్తున్న బోరు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: సన్నచిన్నకారు రైతుల పంట పొలాలకు పుష్కలంగా సాగు నీటిని అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జలకళ పథకానికి శ్రీకారం చుట్టారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల గ్రామంలో జలకళ పథకం ద్వారా ఉచితంగా ఏర్పాటు చేస్తున్న బోరు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ బీడు భూములను సైతం సాగు భూములుగా మార్చి, పంట పొలాలను సస్యశ్యామలం చేసేందుకే జలకళ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యంగా 2.5 నుంచి ఐదెకరాలలోపు పంట పొలం ఉన్న రైతుల వ్యవసాయ భూముల్లో బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. పథకానికి సరిపడా భూమి లేని రైతులు పక్క పొలాల రైతులతో కలిసి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వైస్ ఎంపీపీ నల్లాని రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ నల్లాని అయ్యన్న పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బోరు పంపుల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: వేసవి కాలం దృష్ట్యా పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో బోరు పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం స్థానిక 5, 7 వార్డులకు గాను నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరు పంపుల ఏర్పాటు పనులను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేపలవాగు చివరి ప్రాంతం అయినందున ఎండా కాలం నీటి ఎద్దడి ఏర్పడకుండా బోరుపంపులు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు కోరినట్లు తెలిపారు. దీంతో 5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్, 7వ వార్డు కౌన్సిలర్ పూసాల సీతారావమ్మ చేసిన ప్రతిపాదనల మేరకు బోరు పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పూసాల పుల్లారావు, సీతారావమ్మ పుల్లారావు, నాయకులు బొల్లా శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనర్ చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, డీఈ శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినులు అదృశ్యం

కంచికచర్ల : ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసి ఇంట్లో ఉంటున్న విద్యార్థినులిద్దరూ కనిపించటం లేదని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పెంటె సత్య వెంకట సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కంచికచర్ల అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఇద్దరు బాలికలు(17) మండలంలోని కీసర బీజేటి డిగ్రీ కళాశాలలో చదువుతున్నారు. అయితే ఇద్దరూ ఈనెల 3వ తేదీ నుంచి కనిపించటంలేదు. ఆ విద్యార్థుల తల్లిదండ్రులు బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి తమ పిల్లలు వచ్చారా అని విచారించారు. ఎక్కడా జాడ కనిపించకపోవటంతో మంగళవారం పోలీస్ స్టేషన్‌లో వారి తల్లి ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.